నమస్తే తెలంగాణ
హనుమకొండ
5 | వరంగల్, ఆదివారం 15 సెప్టెంబర్ 2024 | HANUMAKONDA

# కాజీపేట మీదుగా వందేభారత్ రైలు

- నాగపూర్- సికింద్రాబాద్- నాగపూర్ మధ్య రాకపోకలు
- రేపు అహ్మదాబాద్ నుంచి వర్చువల్‌గా ప్రారంభించనున్న ప్రధాని మోదీ



కాజీపేట, సెప్టెంబర్ 14 : నాగపూర్– సికింద్రాబాద్– నాగపూర్ మధ్య వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైలును కాజీపేట మీదుగా సోమవారం నుంచి నడిపిస్తున్నట్లు స్థానిక రైల్వే ఇన్‌చార్జి సీసీఐ సజ్జన్‌లాల్ తెలిపారు. నాగపూర్ రైల్వేస్టేషన్లో మొదటిరోజు సోమవారం సాయంత్రం 4.15 గంటలకు ప్రధాని నరేంద్ర మోదీ అహ్మదాబాద్ నుంచి వర్చువల్‌గా ప్రారంభిస్తారన్నారు. అధునాతన సౌకర్యాలు ఉన్న 20 బోగీలతో 1,440 మంది ప్రయాణికులతో నడుస్తుంది. నాగపూర్ నుంచి సికింద్రాబాద్‌కు కేవలం 7.15 గంట ల్లో చేరుకుంటుందన్నారు. నాగపూర్‌లో సాయంత్రం 4.15 గంటలకు బయలు దేరి, రాత్రి 9. 25 గంటలకు కాజీపేటకు, సికింద్రాబాద్‌కు 11.25 గంటలకు చేరుకుంటుందని చెప్పారు. రైలు రాకపోకల్లో సేవాగ్రామ్, చంద్రపూర్, బల్లార్షా, రామగుండం, కాజీపేట స్టేషన్లలో ఆగనున్నది. కాగా, కాజీపేట జంక్షన్‌లో భారీగా స్వాగత ఏర్పాట్లు చేయనున్నట్లు సజ్జన్‌లాల్ తెలిపారు. ఎంపీ, ఎమ్మెల్యేలు, స్థానిక ప్రజాప్రతినిధులు, రైల్వే ఏడీఆర్ ఎం, సీనియర్ డీఎం ఈ, సీనియర్ డీఈఈ, ప్రజలు తరలివచ్చి వందే రైలుకు స్వాగతం పలికాలని కోరారు.

*18 నుంచి రెగ్యులర్ షెడ్యూల్..*

18 వ తేదీ నుంచి నాగపూర్(20101)లో వందే భారత్ రైలు ఉదయం 5 గంటలకు బయలుదేరి 10.04 గంటలకు కాజీపేటకు, సికింద్రాబాద్‌కు మధ్యాహ్నం 12.15 గంటలకు చేరుకుంటుందని తెలిపారు. తిరిగి అదే రైలు (20102) నంబర్‌తో సికింద్రాబాద్‌లో మధ్యాహ్నం ఒంటి గంటకు బయలుదేరి కాజీపేటకు 2.20 గంటలకు, నాగపూర్‌కు రాత్రి 8.20 గంటలకు చేరుకుంటుందన్నారు. ఈ రైలు వారానికి ఆరు రోజులు మాత్రమే నడుస్తుందన్నారు.

# ఆ ఊళ్లో వినాయకుడొక్కడే !

- 32 ఏళ్లుగా ఒక్కచోటనే విగ్రహ ప్రతిష్ఠాపన
- ఆదర్శంగా నిలుస్తున్న సూరంపేట గ్రామస్తులు



హనుమాన్ దేవాలయంలో వినాయకుడి వద్ద భజనలు చేస్తున్న భక్తులు

శాయంపేట, సెప్టెంబర్ 14 : వినాయక చవితి పండుగ వచ్చిందంటే వాడవాడకు గణనాథుల విగ్రహాలు కొలువుదీరుతాయి. ఒకప్పుడు కాలనీ మొత్తం ఒకటీ రెండు మాత్రమే ఉండగా ఎవరికి వారు విగ్రహాలు పెడుతుండడంతో ఏటా వీటి సంఖ్య పెరుగుతూనే ఉన్నది. కానీ హనుమకొండ జిల్లా శాయంపేట మండలంలోని సూరంపేటలో మాత్రం ఇందుకు భిన్నంగా ఊరంతా ఒక్క వినాయకుడే కనిపిస్తాడు. గ్రామ ప్రజలంతా కలిసికట్టుగా 32 ఏళ్ల నుంచి ఒకేచోట విగ్రహాన్ని ఏర్పాటుచేసి నవరాత్రి సంబురాలను జరుపుకొంటూ ఆదర్శంగా నిలుస్తున్నారు. ప్రతి సంవత్సరం ఒకరు విగ్రహం ఇస్తే.. మరికొందరు అన్నదానం చేస్తారని బీఆర్‌ఎస్ నేత అడుప ప్రభాకర్ చెప్పారు.



నిర్మాణం పూర్తి దశకు చేరుకున్న జిల్లా దవాఖాన, మెడికల్ కళాశాల

# హెల్త్ హబ్‌గా నర్సంపేట

- నిరుపేదల ఆరోగ్యానికి గత ప్రభుత్వం కొండంత భరోసా
- కేసీఆర్ చొరవ, మాజీ ఎమ్మెల్యే పెద్ది కృషితో పేదలకు అందనున్న కార్పొరేట్ వైద్యం
- రూ.66కోట్లతో పూర్తయిన జిల్లా వైద్యశాల నిర్మాణం
- రూ.183 కోట్లతో మెడికల్ కళాశాల ప్రారంభానికి సిద్ధం

9లో

# ప్రతి శనివారం పండుగే..

**'పేరెంట్స్ విజిటింగ్ డే'తో విద్యార్థుల్లో ఆనందం**

- కిటకిటలాడుతున్న కమలాపూర్ బీసీ సంక్షేమ బాలుర పాఠశాల, కళాశాల ప్రాంగణం

కమలాపూర్, సెప్టెంబర్ 14: హనుమకొండ జిల్లా కమలాపూర్ మండల కేంద్రంలోని మహాత్మా జ్యోతిబాపూలే బీసీ సంక్షేమ బాలుర గురుకుల పాఠశాల, కళాశాల ప్రాంగణం శనివారం జాతరను తలపించింది. పేరెంట్స్ విజిటింగ్ డే కావడంతో మైదానం కిటకిటలాడింది. తల్లిదండ్రులు తమ పిల్లలకు ఇష్టమైన తినుబండారాలు తీసుకొచ్చి, తినిపిస్తూ మంచి చెడులు తెలుసుకున్నారు. పట్టుదలతో చదివి ఉతమ ఫలితాలు సాధించాలని సూచించారు. విద్యార్థులు పేరెంట్స్‌తో మాట్లాడుతూ ఆనందం పంచుకున్నారు. కాగా, కొందరు విద్యార్థులు తమ తల్లిదండ్రుల కోసం గేట్ వద్ద నిల్చొని ఎదురు చూశారు. వారు రాకపోవడంతో తెలిసిన తోటి స్నేహితుల తల్లిదండ్రుల వద్ద ఫోన్ తీసుకొని పేరెంట్స్‌తో మాట్లాడారు.



తల్లిదండ్రులు రాకపోవడంతో గేటు వద్ద దీనంగా చూస్తున్న విద్యార్థులు



తల్లిదండ్రులు, విద్యార్థులతో జాతరను తలపిస్తున్న కళాశాల మైదానం



బయ్యారం మండలం పందిపంపుల వాగుపై బ్రిడ్జి పిల్లర్ల వద్ద పేరుకుపోయిన కర్రలు, చెత్త

# మంత్రి, ఎంపీ హామీ ఇచ్చినా..



బ్రిడ్జి సమస్యను మంత్రి సీతక్క, ఎమ్మెల్యే, ఎంపీకి తెలుపుతున్న గ్రామస్తుడు (ఫైల్)

బయ్యారం, సెప్టెంబర్ 14: సార్లు వచ్చారు.. సమస్య చెప్పుకుంటే వెంటనే పరిష్కారమవుతుందని ఆశించిన ప్రజలకు భంగపాటు తప్పలేదు. స్వయంగా మంత్రి సీతక్క హామీ ఇచ్చినా అధికారులు మాత్రం సమస్య వైపు కన్నెత్తి చూడలేదు. ఈ నెల 1న మహబూబాబాద్ జిల్లాలో వరద ముంచెత్తిన విషయం తెలిసిందే. 2న బయ్యారం మండలంలోని అల్లిగూడెం శివారులోని పందిపంపుల వాగును మంత్రి సీతక్క, ఎంపీ బలరాంనాయక్, ఎమ్మెల్యే కోరం కనకయ్య సందర్శించారు. ఈ క్రమంలో అక్కడి ప్రజలు వాగుపై నిర్మించిన బ్రిడ్జి పిల్లర్లు దగ్గరగా వేయడంతో వరద సమయంలో కర్రలు, చెత్త బ్రిడ్జి కింది భాగంలో చిక్కుకొని నీటి ప్రవాహానికి అడ్డు తగులుతుందని, దీంతో గ్రామంలోకి నీరు చేరి ఇబ్బంది పడుతున్నామని తెలిపారు. ఈ విషయాన్ని ఆర్అండ్‌బీ అధికారులకు చెప్పామని, రేపు మధ్యాహ్నం వరకు చెత్తను తొలగిస్తారని, లేని పక్షంలో ఎమ్మెల్యేకు ఫోన్ చేసి చెప్పాలని ఎంపీ బలరాంనాయక్ తెలిపారు. అయితే పది రోజులు గడుస్తున్నా ఇంత వరకు బ్రిడ్జి కింద ఉన్న కర్రలు, చెత్తను అధికారులు తొలగించకపోవడంతో గ్రామ ప్రజలు మంత్రి, ఎంపీ హామీ ఇచ్చినా పని జరగలేదంటూ అధికారుల తీరుపై అసహనం వ్యక్తం చేస్తున్నారు.










































































